నరసరావుపేట బార్ ఎన్నికల్లో వైసీపీకి షాక్

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట న్యాయవాద సంఘం(బార్ అసోసియేషన్) ఎన్నికలో వైసీపీకి షాక్ తగిలింది. వైసీపీ, టీడీపీ లీగల్ సెల్ సభ్యుల మధ్య శుక్రవారం పోటాపోటీగా జరిగిన భారతదేశం ఎన్నికలు టీడీపీ లీగల్ సెల్ సభ్యుడు మేదరమెట్ల నాగేశ్వరరావు 52 ఓట్ల మెజార్టీతో వైసిపి లీగల్ సెల్ సభ్యుడు జి జయప్రకాశ్ పై విజయ సాధించారు. పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జరిగిన ఎన్నికలు టిడిపి సెల్ లీగల్ సభ్యులు గెలిపించడంతో ఆ పార్టీలో ఉత్సాహం వెల్లి విరిసింది. కోర్టు ప్రాంగణం వెలుపల టిడిపి లీగల్ సెల్ న్యాయవాదులు బాణాసంచా పేల్చి సంబరాలు తెలిపారు. ఎన్నికలు ఉపాధ్యక్షురాలుగా టి అమూల్య, కార్యదర్శిగా అబ్బూరి ఏడుకొండలు గెలుపొందారు. ఎన్నికల్లో గెలుపొందిన న్యాయవాదులను నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ అరవింద్ బాబు, టీడీపీ నేతలు అభినందించారు.

బకాయిల వసూళ్లకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో ప్రకటనల బోర్డ్ లకు సంబందించిన ఫీజుల బకాయిల వసూళ్లకు ఈ నెల 25న ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్దం చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాలిక అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో బకాయిలు చెల్లించిన ప్రకటనల బోర్డ్ లకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు ప్రక్రియ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని, ఈ నెల 25న మీడియా డివైజ్ ఫీజుల బకాయిదార్ల నుండి ఫీజుల వసూళ్ళు, చెల్లించని వారిపై చట్టపర చర్యలు తీసుకోవడానికి కార్యాచరణ సిద్దం చేయాలన్నారు. బకాయిలను వార్డ్ సచివాలయాల వారిగా కేటాయించి, ప్లానింగ్ కార్యదర్శులకు, టి.పి.ఎస్.లకు లక్ష్యాలను నిర్దేశించి, ప్రతి రోజు సమీక్ష చేయాలని సిటి ప్లానర్ని ఆదేశించారు. వార్డ్ల వారిగా భవన నిర్మాణ వ్యర్ధాల సేకరణకు స్వచ్ఛ గుంటూరు యాప్ ద్వారా యూజర్ చార్జీలు వసూళ్ళు చేసి, వ్యర్ధాలను తొలగించాలని ప్లానింగ్ కార్యదర్శుల ను ఆదేశించారు. సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏ.సి.పి.లు కాలేష, బాబురావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, సర్వేయర్లు సునీల్ కుమార్, హరి కృష్ణ, టి.పి.ఎస్.లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మేడికొండూరు: విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని డోకిపర్రు శాంతినగర్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై మేడికొండూరు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పేరేచర్ల గ్రామానికి చెందిన దేవరకొండ ఏసుబాబు (35) మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటి పైకప్పు వేయుటకు పనులకు వెళ్తూ ఉంటాడు. రోజు మాదిరిగానే శుక్రవారం డోకిపర్రు గ్రామ పరిధిలోని శాంతినగర్ కాలనీలో ఒక ఇంటికి రేకులు వేయిచుండగా ప్రమాదవశాత్తు పై కప్పు వేయిచున్న ఇంటికి సమీపంలో ఉన్న కరెంటు పోలు కరెంటు వైర్లు తగిలి కరెంట్ షాక్కు గురై కిందపడినాడు. చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా అప్పటికే ఏసుబాబు మరణించినాడు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మేడికొండూరు పోలీసులు తెలిపారు.

పలువురు సీనియర్ సిటిజన్‌లకు గుర్తింపు కార్డులు

విశాలాంధ్ర-గుంటూరువైద్యం: అవగాహన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని ఆ సంస్థ కార్యాలయంలో పలువురు వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డులను శుక్రవారం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా ఏపీ లాయర్ల ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జారీ చేస్తున్న కార్డులను వారికి అందజేయడంలో అవగాహన సంస్థ విశేషంగా కృషి చేయడాన్ని ఆయన అభినందించారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా అవగాహన సంస్థ వృద్ధులకు వేలాదిగా గుర్తింపు కార్డులను అందజేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమశాఖ గుంటూరు జిల్లా ఏడీ సువార్త గారి సహకారంతో సీనియర్ సిటిజన్స్ గుర్తింపు కార్డులను అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు గుర్తింపు కార్డులు ఎంతో ఉపయోగమని, కావలసినవారు స్థానిక అరండల్‌పేటలోని కుబేర టవర్స్ అవగాహన సంస్థ కార్యాలయాన్ని, అదేవిధంగా 9394107157 నందు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లం వెంకటేశ్వరరావు, ఆర్.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: పవిత్ర రంజాన్ పర్వదినం శనివారం జరుపుకుంటున్న నేపధ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ కర్నుమా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం నగరంపాలెం ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా గుంటూరు నగరంలో మూడు ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించుకుంటారని అన్నారు. నగరంపాలెం ఈద్గా, పాతబస్టాండ్ వద్ద ఉన్న మొహమ్మదీయన్ స్కూల్ ఆవరణలోనూ.. పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కాలేజీ ఆవరణలో ప్రార్ధనలు నిర్వహిస్తారని వారు వెల్లడించారు. మూడు ప్రాంతాల్లో నగరపాలకం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ ముస్లింలకు ప్రత్యేక శ్రద్ధ చూపారని, గత ప్రభుత్వాల కన్నా వైసీపీ ప్రభుత్వంలో పెద్ద పీట వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, కార్పొరేటర్లు మొహమూద్, ఖాజా మొహిద్దీన్ చిష్టి, ఆబీద్‌బాష, మీరావలి, అంజుమన్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ సలామ్, సభ్యులు హిదాయత్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

దేవరపల్లి చిన్నపాములు, S/o. దేవరపల్లి పెదగోపయ్య, డోర్ నెం.7-1రు, రావెల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లాకు చెందిన నాకు సంబంధించిన రావెల గ్రామ డి.నెం.94/ఏ1రు నల్లపాడు రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిష్టరు కాబడిన ద.నెం. 7173/2015ను నేను వ్యాపార నిమిత్తం మా స్వగృహము నుండి రిజిష్టారు కార్యాలయంకు వెళ్ళినప్పుడు మార్గమధ్యములో జారిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల 9676348525లో తెలియజేయగలరు.

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా , గుంటూరు సిటి కొరిటపాడు కాపురస్తులు అయిన కసిరెడ్డి వెంకటరెడ్డి గారి కుమారులు కసిరెడ్డి వెంకట-శివారెడ్డి మరియు కసిరెడ్డి శివశంకర్‌రెడ్డి గారికి సంబంధించి ఉన్న గుంటూరు జిల్లా ,గుంటూరు సిటి, రెడ్డిపాలెం నందు డి.నెం : 256 నందు స్థలము ఉన్నది. డి.నెం : 256 సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరిపిన హక్కుదారులమైన మమ్ముల్ని సంప్రదించవలసినదిగా కోరుచున్నాము

ఇట్లు
కసిరెడ్డి వెంకట-శివారెడ్డి
కసిరెడ్డి శివశంకర్ రెడ్డి

సెల్ : 9618832396
8686831152

టెండరు నోటీసు

గుంటూరుజిల్లా, పొన్నూరు(మం), దొప్పలపూడి గ్రామ పంచాయితీకి ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన సామాన్లు సప్లయి చేయుటకు సీలువేసిన టెండర్లు ఈ దిగువ సంతకం చేసిన వారిచే ది.30-04-2023 మధ్యాహ్నం గం॥3-00ని॥ల వరకు స్వీకరించబడి, అదేరోజు గం॥3-30ని॥లకు హాజరైన టెండరు దారుల సమక్షమున తెరువబడును. టెండరు దాఖలు చేయువారు టెండరు ధరావత్తు చెల్లించి, రశీదు పొంది టెండరుకు జతపరచవలయును. ఇతర వివరములకు ఆఫీసు పనిచేయు వేళలయందు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం.	సప్లయిచేయవలసిన సామాను వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1.	2023-2024 సం॥నకు ఎలక్ట్రికల్ సామానులు సప్లయిచేయుటకు	100
2.	2023-2024 సం॥నకు PHC సామానులు సప్లయిచేయుటకు	100
3.	2023-2024 సం॥నకు P.W.S. సామానులు సప్లయిచేయుటకు	100

తేది : 30-04-2023.

పంచాయితీ కార్యదర్శి
దొప్పలపూడి గ్రామ పంచాయితీ.

రైతాంగం నడ్డి విరిస్తున్న బీజేపీని తరిమికొడదాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్

విశాలాంధ్ర-మంగళగిరి: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార భేరి కార్యక్రమాన్ని శుక్రవారం నవులూరు, చిన్నకాకాని గ్రామాలలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ ప్రారంభించారు. జంగాల మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీని ఇంటికి సాగనంపి, భారతదేశాన్ని కాపాడాలని కోరారు. రైతాంగం పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా మోదీ ప్రభుత్వం చోద్యం చూస్తుంది తప్పితే భారతదేశానికి వెన్నుముకైనా రైతాంగాన్ని పట్టించుకోకుండా మూడు నల్లచట్టాలను అమలు చేసి రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలో నెట్టిందని, గాలి వానలకు పంట నష్టపోయిన రైతులకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుజరాతీయులైన అదానీ, అంబానీలకు మాత్రం విమానాశ్రయాలు, ఓడరేవులు దేశ సంపాదన మొత్తం దోచిపెడుతున్నారని అన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిత్యవసర వస్తువులు, మందుల ధరలను రోజురోజుకు పెంచుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ వైపు శరవేగంగా పరుగులు పెడుతుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా దారాదత్తం చేస్తున్నదని మండిపడ్డారు. ఆంధ్రుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కును కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు అమ్మబోతున్న బీజేపీ సర్కార్ బడ్జెట్‌లో రాజధాని నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆగ్రహించారు. ప్రత్యేక హోదా, విభజన హామీ చట్టాలను తుంగలో తొక్కిన కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ, టీడీపీ, జనసేన నోరుమెదపడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీకి అధికార, ప్రతిపక్ష పార్టీలు వంతపాడుతున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ రాష్ట్రంలోని వైసీపీ తోడు దొంగల్లా వ్యవహరిస్తూ సామాన్య ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్నారు. బీజేపీ ప్రజా వినాశకర, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు గళం విప్పాలన్నారు. రాష్ట్రం అంతా మార్చి నెల పెన్షన్లు ఇచ్చిన ప్రభుత్వం, రాజధానిలో వృద్దులు, వితంతువులు, వికలాంగులు ఏం పాపం చేశారని వారికి పెన్షన్ నిలిపివేశారని ప్రశ్నించారు. తక్షణం రాజధానిలో పెన్షన్లు ఇవ్వకపోతే పెన్షన్‌దారులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ఈ నెల 24న మంగళగిరిలో ఆటోనగర్ దగ్గర జరిగే బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. నవులూరు, చిన్నకాకాని గ్రామాలలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను ప్రజలకు అందజేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నియంతృత్వ ధోరణులను ప్రజలకు వివరించి బీజేపీని గద్దెదింపే వరకు ప్రచార బేరి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. నీరుకొండ, కురగల్లు, నిడమర్రు, బేతపూడి గ్రామాలలో ఉదయం ప్రచారయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు, ఆర్ధల వెంకట్రామయ్య, పొదిలి మరియదాసు, పంతగాని మరియదాసు, నల్లిబోయిన, శంకర్రావు, గోవిందులు తోట వెంకటరామయ్య, కటారి జేసుదాసు, శంకర్రావు, సాంబశివరావు, సీపీఎం నాయకులు ఎం.రవి, భాగ్యరాజు, వెంకటేశ్వరరావు, ప్రకాష్‌రావు, ఈమని అప్పారావు, బాబు వరప్రసాద్, దాసు తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సమర్థవంతమైన పాలన : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల అంచనాలకు అనుగుణంగా ప్రభుత్వ సేవలు అందించటం ద్వారానే సమర్ధవంతమైన పరిపాలన సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని డీఆర్సీ హాలులో జరిగిన 16వ సివిల్ సర్వీసెస్ డే కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో వివిధ బాషలు, జాతులు, వర్గాల ప్రజలకు గతం, ప్రస్తుత కాలాలతో పాటు భవిష్యత్తులోను మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేలా పటిష్టమైన పరిపాలన వ్యవస్థకు దేశంలోని అనేక మంది సివిల్ సర్వేంట్ అధికారులు గట్టి పునాది వేశారన్నారు. సంయుక్త కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజలు సాధారణంగా అధికారి హోదాకు మాత్రమే గౌరవం ఇస్తారని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులను మాత్రమే హోదాతో పాటు వ్యక్తిని గౌరవించి జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు. సంయుక్త కలెక్టర్ తాను చిన్నతనంలో స్ఫూర్తి పొందిన సంఘటనలను తెలిపారు. తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ఉన్నతాధికారులను ఉద్యోగులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు మాట్లాడుతూ జాతీయ పౌర సేవల దినోత్సవం సందర్భంగా ఆదర్శవంతమైన పరిపాలనకు పునాది వేసిన ఆలిండియా సివిల్ సర్వేంట్స్ అధికారుల పనితీరును ఆదర్శంగా తీసుకొని జిల్లా అధికారులు ప్రజలకు సక్రమంగా ప్రభుత్వ సేవలు అందించాలన్నారు. సభలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సాయిశ్రీ, ఎస్ఎస్ఏ ఏపీసీ విజయలక్ష్మీ, ఏపి రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కిరణ్, మహాత్మాగాంధీ ఫెలోషిప్ ఫణీంద్ర మాట్లాడారు. అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ జాతీయ పౌర సేవల దినోత్సవం ప్రతిజ్ఞను అధికారులు, ఉద్యోగులతో చేయించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలితా, జిడ్పీ సీఈవో మోహనరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మోవిడి వాణి, జిల్లా ఉపాధి అధికారి రఘు, తదితర జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డాక్టర్ పినపాటి ప్రభుదాసు విగ్రహాన్ని ప్రతిష్టించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: స్థానిక నాజ్ సెంటర్ ఐలాండ్ నందు అక్టోబర్ 15వ తేదీ నాటికి డాక్టర్ పినపాటి ప్రభుదాసు విగ్రహన్ని ప్రతిష్టించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని 'మేడ్' రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓల్డ్‌క్లబ్ రోడ్డులో ఉన్న 'మేడ్' రాష్ట్ర కార్యాలయం నందు 'ఆంధ్ర క్రైస్తవ కళాశాల మాజీ ప్రిన్సిపల్, గుంటూరు పురపాలక సంఘం చివరి చైర్మన్ డాక్టర్ పినపాటి ప్రభుదాసు 33వ వర్ధంతి జరిగింది. జైసన్, పేరుపోగు కమ లయ్య, కర్రా అబ్రహాం, సంబూరి భాస్కరరావు, దాసరి శ్రీనివాసరావు, కొమ్ము లాజరస్, పాతకోటి యేసు, షేక్ జానీ, షేక్ గౌసిడియా పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న నేత చంద్రబాబు

విశాలాంధ్ర-ఈపూరు : టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 73వ జన్మదిన వేడుకలను మండ లంలోని ముప్పాళ్ళలో టీడీపీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ నాయకులు చంద్రబాబు నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి సంబరాలు జరుపు కున్నారు. అనంతరం పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గా రావు మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి దేశ రాజకీ యాల్లో సీనియర్ నేతగా, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నేతగా చంద్ర బాబు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారని 25 ఏళ్లకే ఎమ్మెల్యేగా, 28 ఏళ్లకే మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన టీడీపీ అధినేతగా, ముఖ్య మంత్రిగా, ప్రధాన ప్రతిపక్ష నేతగా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పులుకూరి శ్రీనివాసరావు, సూరే కోటయ్య, మద్దినేని గోవిందరాజులు, వీరవల్లి రాధా, మోదుగుల అప్పారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశర్లపాడులో గ్రామోదయం

విశాలాంధ్ర-రెంటచింతల: మండలంలోని పశర్లపాడులో అన్ని శాఖల అధికారులు శుక్రవారం గ్రామోదయ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ షేక్ - గౌసియా బేగం, ఈఓఆర్డీ రామచంద్రరావు, డీటీ రాజారావు, ఏఈ నరేంద్రరెడ్డి, ఏపీయం చిన్నబాబు, అంగన్వాడీ సూపర్వైజర్ మహాలక్షువమ్మ, పిహెచ్సీ వైద్యురాలు హేవ కలిసి వివిధశాఖల అధికారులు వీధులలో పర్యటించారు. మంచినీటి, విద్యుత్తు, గర్భిణీ స్త్రీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టిన పనుల గురించి ఆరా తీసారు. దుర్గి మార్కెట్ యార్డు డైరక్టరు వెన్నా వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాలునాయర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపిల్ పాఠశాలలో రంజాన్ వేడుక

విశాలాంధ్ర-మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్లలో ఉన్న ఆపిల్ పాఠశాలలో శుక్రవారం రంజాన్ పండుగ సంబరాలు పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అజయ్ కుమార్ రంజాన్ పండుగ యొక్క ప్రాముఖ్యత వివరించారు. రంజాన్ పవిత్ర మాసం యొక్క ప్రాముఖ్యత, నమాజ్, ఫిత్రా, జాకాత్ దాన ధర్మాలు, తల్లిదండ్రులను గౌరవించడం, సన్మార్గంలో నడవాలని పాఠశాల విద్యార్థులకు ఉపదేశమిచ్చారు. ఏటా ఈ సంవత్సరం కూడా క్వింటాన్నర ఖర్జూర పండ్లను చుట్టు ప్రక్కల ఉన్న మసీదులకు, పాఠశాల తల్లిదండ్రులకు, ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు పంచిపెట్టారు.

మెడికల్ కిట్లు అందజేత

విశాలాంధ్ర-మాచర్ల: నేత్రాలయం కంటి వైద్యశాల నిర్వాహకులు షేక్ బాషా శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య కు బస్సులలో ఏర్పాటు చేసేందుకు 85 మెడికల్ కిట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డి.ఎం పిచ్చయ్య మాట్లాడుతూ ప్రయాణీకులకు అత్యవసర సమయాలలో ఉపయోగించే మెడికల్ కిట్లను నేత్రాలయం కంటి వైద్యశాల నిర్వాహకులు ఉచితంగా అందజేయడం సంతోషకరమన్నారు. కిట్లు ప్రయాణికులకు అత్యవసర సమయాలలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. బస్సులలో కిట్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. నేత్రాలయం నిర్వాహకులు షేక్ జానీ మాట్లాడుతూ ప్రతి ఏటా కొంతమందికి మెడికల్ కిట్లను ఉచితంగా ఇవ్వడం తోపాటు, మెడికల్ క్యాంపులను కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది శ్రీనివాసరావు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా ప్రహరీ గోడ, మినార్లను ప్రారంభం

విశాలాంధ్ర-మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలో ఉన్న ఈద్గాకు నూతనంగా ఏర్పాటు చేసిన ప్రహరీ గోడను శుక్రవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు వైయస్సార్సీపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిన్నెల్లి సోదరులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపి మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ఇచ్చిన మాట ప్రకారం గతంలో ఈద్గా నిర్మాణంతోపాటు, ఈ ఏడాది ప్రహరీ గోడ, 2 మినార్ లను నిర్మించుకునేందుకు రూ.33 లక్షలను అందజేయడం జరిగిందని అన్నారు. త్వరలో ఈద్గాలో నూతన బోరును వేయించనున్నట్టు వారు పేర్కొన్నారు.

రాజధానిలో భారీ అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-తుళ్ళూరు: రాజధాని అమరావతి ప్రాంతంలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరం రెవెన్యూ పరిధిలో బీఎస్ఆర్ నిర్మాణ సంస్థ రాజధాని 6వ ప్యాకేజీ పనులకు సంబంధించిన సామాగ్రిని నిల్వ చేసారు. 20 ఎకరాల విస్తీర్ణంలో ఆరు ప్యాకేజీల సరుకుకు గత నాలుగు సంవత్సరాలుగా అక్కడే నిల్వ ఉంచారు. తేనె సేకరించేందుకు వచ్చిన వారు నిప్పంటించారని పలువురు చెబుతుంటే.. సంస్థ సెక్యూరిటీ సిబ్బందిలోని ఓ వ్యక్తే రహదారి పక్కన ఉన్న చెత్తాచెదారం పోగు చేసి నిప్పంటిచడం వల్ల చుట్టూ ఎండుగడ్డి ఉండడంతో ఊహించని ప్రమాదం జరిగిందని పలువురు చెబుతున్నారు. అయితే సదరు సంస్థ పరిసరాల్లోకి అనుమతి లేని వ్యక్తులు వెళ్ళకుండా సెక్యూరిటీ సిబ్బంది కూడా ఉంది. కారణాలేమైనా నిప్పు అంటుకున్న సమయంలో గాలి వేగం, ఎండ అధికంగా ఉండడంతో మంటలు చెలరేగాయి. దీంతో పరిసరాల్లో ఉన్న పైపులు, పవర్ కేబుల్స్, అండర్ గ్రౌండ్ కేబుల్స్ మంటలు వ్యాపించాయి. ప్రమాదం జరిగిన కొంత సేపు తరువాత ఫైర్ ఇంజన్ వచ్చినప్పటికీ అదుపు చేయలేని పరిస్థితి ఉంది. ఈ ప్రమాదంలో పరిసరాల్లో ఉన్న పైపులు దాదాపుగా అగ్నికి ఆహుతయ్యాయి. వాటి విలువ కోట్లలో ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. బీఎస్ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ మాట్లాడుతూ ప్రమాదం జరిగినట్టు ఉదయం 10.20కి సమాచారం రాగా అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చామని.. మధ్యాహ్నం 12 గంటలకు ఫైర్ ఇంజన్ వచ్చిందన్నారు. ఒక్కటే ఫైర్ ఇంజన్ అవడంతో మంటలు అదుపుచేయలేకపోయామన్నారు. 20 ఎకరాల విస్తీర్ణంలో పలు ప్యాకేజీల పనుల సామాగ్రి నిల్వ చేసినట్టు తెలిపారు. ప్రమాదానికి కారణాలు.. ఎంత మేర నష్టం జరిగిందనేది తెలియాల్సి ఉందని స్పష్టం చేశారు.

ఆర్టీసీ బస్సులకు ఫస్ట్‌ఎయిడ్ కిట్స్

విశాలాంధ్ర-తెనాలి: తెనాలి ఆర్టీసీ డిపోలో శుక్రవారం విఘ్నేశ్వర మెడికల్ షాపు వారు 87 బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ని డిపో మేనేజర్ రాజశేఖర్‌కు అందజేశారు. తెనాలి డిపోలో ఆర్.టీ.సి. ఎయిర్‌బస్సులు, సాధారణ బస్సులు అన్నింటికి మెడికల్‌షాపు వారు 100 ఫస్ట్‌ఎయిడ్ కిట్స్‌ను ఆ సంబంధింత డ్రైవర్ కండెక్టర్లకు అందజేశారు. ప్రజల సౌకర్యార్థం ప్రతి బస్సులోను కిట్స్ ఏర్పాటు చేసి వాటి వినియోగం గురించి కూడా మెడికల్ షాపు వారు వివరించారు. మెడికల్ షాపు నిర్వాహకులు భార్గవచైతన్య మాట్లాడుతూ బస్టాండ్‌కి సంబంధించిన గాని, గ్యారేజ్‌కి సంబంధించినవి గాని చిన్న చిన్ని అవసరములు ఏమైనా ఉన్నచో వాటిని కూడా అందజేస్తామని అన్నారు. డిపో మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ విఘ్నేశ్వర మెడికల్‌షాపు వారు కిట్స్ అందజేయడం అభినందనీయమని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిపోలో సీనియర్ జర్నలిస్టు రఘురామయ్య గ్యారేజి సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రసాదరావు, అభిరామ్ నాయక్, ఆర్.టీ.సి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అన్నాబత్తుని ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర-తెనాలి: తెనాలి, దేవి చౌక్ సెంటర్‌లోని శ్రీలత ఎ1 కన్వెన్షన్ హాలులో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులతో తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలకు నూతన వస్త్రాలను బహూకరించి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదర్లు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవడమే కాకుండా సమాజ సేవలో కూడా తమ వంతు కర్తవ్యాన్ని నెరవేర్చాలన్నారు. మతపెద్దలు పండుగ సందర్భంగా శివకుమార్‌ను పట్టువస్త్రాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

మూల్యాంకన కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర-గుంటూరు: గుంటూరు స్టాల్ గర్ల్స్ హైస్కూల్‌లోని పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానంద రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన తీరును పరిశీలించారు. పరీక్షా పత్రాల మూల్యాంకనం చాలా జాగ్రత్తగా చేయాలని సూచించారు. మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయుల కోసం చల్లటి మంచినీరు, పురుషులు, మహిళల కోసం ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాట్లు చేయడంపై జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ ఉప విద్యాశాఖధికారి కె.సుధాకర్ రెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటరెడ్డిలను అభినందించారు. అధికారులందరూ తమ తమ స్థాయిని మరిచి సమష్టిగా కృషి చేసి చక్కగా ఏర్పాట్లు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మూల్యాంకనం పూర్తయ్యే వరకు ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఏసీఓలకు సూచించారు. ఏసీఓలు, క్యాంపు సిబ్బంది, ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

'రేపు ట్రెజరీ విశ్రాంత ఉద్యోగుల' వార్షిక సమావేశం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఈ నెల 23వ తేదీన స్థానిక రెవిన్యూ భవన్‌లో ట్రెజరీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం వార్షిక సమావేశం జరుగుతుందని ట్రెజరీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి పి.నాగరాజు శుక్రవారం తెలియజేశారు. జిల్లా ట్రెజరీ ఉప సంచాలకులు బి.రాజగోపాల్, రాష్ట్ర ట్రెజరీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.కడెలయ్య, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంక టేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని పెన్షనర్ల సమస్యలపై చర్చించి,ప్రసంగిస్తారు. ఇంకా ఇతర జిల్లాల, రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారు తదుపరి 75 సంవత్సరాలు నిండిన ట్రెజరీ విశ్రాంత ఉద్యోగులకు జిల్లా కార్యవర్గం సన్మానం నిర్వహిస్తోంది. ఈ సభకు జిల్లాలోని సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సెలవురోజుల్లోనూ పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023-24) సంబందించిన ఆస్తి పన్నును ఏక మొత్తంగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ లభిస్తుందని, పన్ను చెల్లింపుదారులకు వీలుగా శని, ఆదివారం సెలవు రోజులు అయినప్పటికీ క్యాష్ కౌంటర్లు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ధార్మిక చింతనకు ప్రతీక రంజాన్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సామరస్యానికి, సహృద్భావానికి, సర్వ మానవ సమత్వానికి, కరుణ, దాతృత్వానికి ప్రతీకగా రంజాన్ పర్వదినాన్ని శాసనమండలి సభ్యులు, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. ఉపవాసాలు, దీక్షలు, దానధర్మాలు, ధార్మిక చింతనలతో సాగే రంజాన్ మాసం పరమ పవిత్రమైనదని ఆయన వెల్లడించారు. పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

మిర్చియార్డ్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మిర్చి యార్డ్‌లో ట్రాఫిక్ నియంత్రించేందుకు గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం మిర్చి యార్డ్ నందు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైతులతో మాట్లాడి రైతులకు అందుతున్న సేవలు, లభిస్తున్న ధరలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్‌రెడ్డి కొట్ల ముందు మిర్చి బస్తాలను క్రమ పద్ధతిలో ఉంచుకో వాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న మిర్చి బస్తాలను క్రమ పద్ధతిలో ఉంచాలని ముఠా కార్మికులకు ఆదేశించారు. అనంతరం ఉచిత భోజనశాలను సందర్శించి భోజన నాణ్యతను పరిశీలించి, భోజనశాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రైతులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనం తరం రైతులతో కలిసి భోజనం చేశారు. యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, యార్డ్ ఇన్‌ఛార్జ్ కె.శివారెడ్డి, యార్డు పాలకవర్గం, అధికారులు, మిర్చి కమిషన్ షాప్ యజమానులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ప్రయోజనం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బాలింత తల్లులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు విమల కుమారి పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ ఆధ్వర్యంలో తల్లి పిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా శుక్రవారం గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రిలోని బాలింతల వార్డులో తల్లులకు, చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు అందచేశారు. రోటరీ క్లబ్ కార్య దర్శి పద్మజ, క్లబ్ డైరెక్టర్లు ఆదిశేషు, అప్పారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రవణ్, ఏడి సీహెచ్ నాగేశ్వరరావు, రాధరాణి సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

25 ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధం

విశాలాంధ్ర-నరసరావుపేట: నరసరావుపేట రూరల్ మండలం పరిధిలోని పమిడిపాడు గ్రామ పరిధి పొలాల్లో రైతులు సాగు చేస్తున్న 25 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి చేతికొస్తున్న మొక్కజొన్న కంకులు పూర్తిగా బూడిద పాలయ్యాయి. పొలాలకు సంబంధించిన రైతులు గోపి, జాన్ సైదా తెలిపిన వివరాలు ప్రకారం తమ పొలాలకు పై ఎత్తున ఉన్న గొళ్ళ పాడు గ్రామ రైతులు తమ పొలాల్లో వేసిన మెట్ట పంటలకు వేసవి సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నిప్పు పెట్టారని, ఆ నిప్పు గాలికి వచ్చి తాము సాగు చేస్తున్న మొక్కజొన్న పంటపై పడిందని, సుమారు 25 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైనదని తెలిపారు. ఎకరాకు సుమారు లక్ష రూపాయలు మేర పెట్టుబడులు పెట్టామని, పంట చేతికి వచ్చేవేళ ప్రమాదంతో పూర్తిగా దగ్ధమైందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు తాసిల్దార్‌కు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ నియోజకవర్గం బొల్లా వెంకట కోటయ్య సత్యవతి ఫౌండేషన్ వారు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అలానే ఈ నెలలో మూడవ శుక్రవారం నుండి మా ఫౌండేషన్ వారు పేదలకు అన్నదానం చేస్తున్నారు ఈ నాలుగు శుక్రవారం అన్నదాన కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ అన్నవరపు వీరాంజనేయులు వి.వి. మురళీకృష్ణ ,న్యాయవాది ఎలవర్తి. శ్రీనివాసరావు ,ప్రముఖ న్యాయవాది జెట్టి. తిరుపతిరావు, ప్రముఖ న్యాయవాది పాల్గొన్నారు. ఫౌండేషన్ ద్వారా చాలా మంచి కార్యక్రమాలు చేస్తున్నారు. చాలా కాలము నుండి స్కూలు పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేయుట గత ఈ నెల నుండి ప్రతి శుక్రవారం రోజున అన్నదానం చేయుట చాలా మంచి విషయమని ఈ ఫౌండేషన్ ఇంకా బాగా అభివృద్ధి చెంది ఇంకా మంచి మంచి కార్యక్రమాలు చేయాలని ఆ దేవుని ఆశీస్సులు ఉండాలని మనసారా కోరుకుంటున్నాను అన్నారు. వీవీ మురళీకృష్ణ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఫౌండేషన్ అధ్యక్షులు బొల్లా. శ్రీనివాసరావు, వ్యవస్థాపకులు బొల్లా. రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

మిల్లు కార్మికుని ఆత్మహత్య

విశాలాంధ్ర-యడ్లపాడు: యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని భవనం స్పిన్నింగ్ మిల్ వద్ద కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు గ్రామవాసి నాగం శ్రీను (35) ఈ నెల18 వ తేదీన పురుగుల మందు తాగినట్లు మేనల్లుడు నందమూరి వీర గంగాధర రంగారావు ఫిర్యాదు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. మందుతాగిన అనంతరం తనకు అస్వస్థతగా వున్నట్లు బంధువుల కు ఇచ్చిన సమాచారం మేరకు బంధువులు శ్రీను ను కాకినాడ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ 20వ తారీకు సాయంత్రం మృతి చెందినట్లు ఫిర్యాదులో వివరించారు. కాగా ఇతను తమ మిల్లు కార్మికుడు కాదని సదరు మిల్లు యాజమాన్యం చెబుతున్నట్లు సమాచారం.

ధర్మవరంలో అధికారుల బృందం పర్యటన

విశాలాంధ్ర-దుర్గి: మండల పరిధి లోని ధర్మవరం గ్రామంలో శుక్ర వారం మండల అధికారుల బృందం పర్యటించారు. ఈసందర్భంగా మండల పంచాయతీల అధికారి జీ. ఎల్ఎస్ గుప్తా బాలింతలు, గర్భ వతులతో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల నుంచి పోషకాలు అందుతున్నయా అని ఆరా తీశారు. గృహ నిర్మాణాలు పరిశీలించారు. పాఠశాలను తనిఖీ చేశారు.చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్. గంగారపు లక్ష్మీ వెంకటరెడ్డి, ఎపిఓ.చిన వెంకటేశ్వర్లు, పీఆర్ ఎఈ.వెలుగొండారెడ్డి, శివప్రసాద్, లీలావతి, సాంబశివరావు, సెక్రటరీ. వై.వెంకటేష్,సచివాలయ, అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక బిసి కాలనీలో గల మండల విద్యా వనరుల కేంద్రం లో శుక్రవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంఇఓ కె.పి.బాబురెడ్డి మాట్లాడుతూ మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల పేరెంట్స్ కమిటీ సభ్యులకు ఈ నెల 24 నుండి 29 వరకు సోషల్ ఆడిట్ పై శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సభ్యులు అందరూ హాజరయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్ పై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమమునకు పెరవలి రవితేజ, యం.శారద లు రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.సి పచ్చవ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'భూ హక్కు-భూ రక్ష' పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: జిల్లాలో వై.ఎస్.ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం కార్యక్రమ పనులు వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా, నరసరావు పేట రూరల్ మండల పరిధిలో గుంటగార్లపాడు, వల్లపు చెరువు వద్ద హద్దు రాళ్ళు ఏర్పాటు చేస్తున్న పనులను శుక్రవారం జరుగుతున్న జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చెరువు విస్తీరణం, కొలతలు వేసిన తీరు, హద్దు రాళ్ళు వేస్తున్న ప్రాంతం, పనులు జరుగున్న తీరును జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 70 గ్రామాలకు గాను 1,39,633.58 ఎకరాలలో హద్దు రాళ్ళు ఏర్పాటు చెయ్యాలని లక్ష్యంగా పెట్టు కున్నామన్నారు. ఇందుకోసం 2.08.386 హద్దు రాళ్ళు ఏర్పాటు చెయ్యాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి వివరాలను పంపామన్నారు. ప్రభుత్వం ఇప్పటికి 1.58,913 హద్దురాళ్ళు వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అందులో ఇప్పటి వరకు 69,897 హద్దురాళ్ళు వేయడం జరిగిందన్నారు. హద్దు రాళ్ళు ఏర్పాటు కార్యక్రమంలో సుమారు వంద టీమ్ లు పని చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ టీమ్ లు అన్ని సుమారు 50 రోవర్ల ద్వారా రోజుకు 4,500 హద్దు రాళ్ళు వేసేందుకు మార్కింగ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అయితే సరాసరి ఒక్క రోజుకు సుమారు 50 టీమ్ లు 3,400 హద్దు రాళ్ళు వేస్తున్నారని, లక్ష్యం మాత్రం కనీసం రోజుకు 3,500 వరకు హద్దు రాళ్ళు వెయ్యాల్సి ఉందన్నారు. రోజుకు 7 గ్రామాల్లో హద్దు రాళ్ళు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇంకా 63 గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం ద్వారా గ్రామాల్లు హద్దు రాళ్ళు వేసే కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మరో 89,016 హద్దు రాళ్ళు వేసే కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. 25 రోజుల పాటు హద్దు రాళ్ళు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మే 25 నాటికి హద్దు రాళ్ళు ఏర్పాటు కార్యక్రమాన్ని తప్పని సరిగా పూర్తి చేయ్యాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పనుల వలన శాశ్వత భూ పరిష్కారం లభించేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని వంద శాతం నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయ్యాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట రెవెన్యూ డివిజన్ అధికారి శేషి రెడ్డి, పలువురు రెవెన్యూ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దత్త పుత్రులకు దోచిపెట్టడమే మోదీ లక్ష్యం

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్

విశాలాంధ్ర-రెంటచింతల: దేశ సంపదను దత్త పుత్రులైన అంబానీ, ఆదానీలకు దోచిపెట్టడమే లక్ష్యంగా మోడీ, అమిత్ షా పరిపాలన సాగుతుందని పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ తెలిపారు. రెంటచింతలలో శుక్రవారం ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ప్రజా సంక్షేమం కరువైందన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేపట్టిన ప్రధాని మోడీ, సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర సంక్షేమాన్ని గాలికొదిలి కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాయడం దుర్మార్గమన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగి నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో పేదలకు జీవనం కష్టతరంగా మారిందన్నారు. పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా సెక్రటరీ మేకపోతు శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేట: దేశాన్ని అప్పుల ఊబిలోకి నెడుతూ, కార్పొరేట్ వ్యాపార దిగ్గజాలకు కొమ్ముకాస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు గత దింపేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాలని, పోరాటాలకు సిద్ధం కావాలని పల్నాడు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా సీపీఐ, సీపీఎం వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన మోదీ హటావో-దేశ్ కి బచావో ప్రచార కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో సీపీఐ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినటువంటి దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేసేందుకు నరేంద్ర మోదీ శాయశక్తుల ప్రయత్నిస్తున్నారని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేశారని, దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఇంధన ధరలను సామాన్యులకు అందుబాటులో లేకుండా పెంచారని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, నిరుద్యోగ సమస్య నానాటికి పెరిగిపోతుందని ఇవేవీ పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను, పోర్టులను వారికి దారాదత్తం చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన చెప్పు చేతుల్లో పెట్టుకొని రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి, రాజధాని సమస్యను సృష్టించి ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపేందుకు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటాల సిద్ధం కావాలని రాంబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, జమ్ముల వెంకటేశ్వర్లు, యు.రాజు, జి.హర్ష, మస్తాన్, సైదులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-వినుకొండ: విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం వారి ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయం నందు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా సేవా సంఘ సభ్యుల సహాయ సహకారములతో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవా కార్యక్రమాలు కొనసాగించడం జరుగుతుందని తెలియజేశారు. కూచిపూడి వీరాంజనేయులు వారి వివాహ వార్షికోత్సవము సందర్భంగా అన్నదానం నిర్వహించామన్నారు. వారికి సంఘం తరపున అభినందనలు తెలియజేశారు. సంఘ సభ్యులు ఎంవీ శర్మ, ఏ. రామలింగేశ్వర రావు, అవ్వారు కోటేశ్వరరావు, టి శేషయ్య, జోజయ్య, నాగేంద్రుడు, దీక్షితులు, ఏ. వెంకటేశ్వరరావు, కే. కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ద్వారా ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర-వినుకొండ: పాలిటెక్నికల్ కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ద్వారా ప్రవేశం పొంది ఉపాధి అవకాశాలు సాధించాలని కృష్ణ గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్ రావు సూచించారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినుకొండ ప్రాంతీయ కార్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, పాలిటెక్నిక్ ఏపీఆర్జేసీ ప్రవేశానికి ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య వక్తలుగా కేఎస్. లక్ష్మణరావు హాజరై ప్రసంగించారు. మే 10వ తేదీన పాలిటెక్నిక్ ప్రవేశానికి పరీక్షలు ఉన్నాయని, పదవ తరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ పరీక్షలు 120 మార్కులకు జరుగుతాయని, మ్యాథ్స్ 50, కెమిస్ట్రీ-30, ఫిజిక్స్-40 మార్కులకు రెండు గంటలపాటు పరీక్ష జరుగుతుందన్నారు. పాలిటెక్నిక్ మూడు సంవత్సరాలు పూర్తి చేయటం వలన ఈ సెట్ ద్వారా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశించవచ్చని వివరించారు. పాలిటెక్నిక్ ద్వారా ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నందున జీవితంలో త్వరగా సెటిల్ కావచ్చు అని తెలిపారు. ఏపీ ఆర్ జె సిలో ప్రసిద్ధిగాంచిన నిమ్మకూరు, తాడిపూడి, వెంకటగిరి, నాగార్జునసాగర్, కొడిగనహళ్లి కాలేజీలు ఉన్నాయని, వీటి ద్వారా ఎంతో మంది ఐఏఎస్ లు తయారయ్యారని తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఏపీఆర్జేసీకి దరఖాస్తులు చేసి ఎంట్రన్స్ పరీక్షలు రాసి ప్రవేశం సాధించాలని ఆకాంక్షించారు. అలాగే రాష్ట్రంలో నాలుగు ట్రిబుల్ ఐటీ కాలేజీలు ఉన్నాయని పదవ తరగతిలో 550 మార్కులు పై వచ్చిన విద్యార్థులు ట్రిబుల్ ఐటీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏపీఆర్జేసీ, పాలిటెక్నిక్ ప్రవేశానికి యుటిఎఫ్ ఉచితంగా శిక్షణ ఇస్తుందని ఈ అవకాశాన్ని వినుకొండ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. రవిబాబు, ఆర్. విజయ్ కుమార్, శ్రీనివాస శర్మ, ఎస్. కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు బొంకూరి వెంకటేశ్వర్లు, పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల అర్ధ నగ్న ప్రదర్శన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో నారా చంద్రబాబునాయుడు పర్యటనను అడ్డుకున్న ఆదిములపు సురేష్ చర్యలకు నిరసనగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని గుజ్జనగుండ్ల సర్కిల్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్, దళిత సంఘాలు అర్ధ నగ్న నిరసన ప్రదర్శన చేపట్టటం జరిగింది. ఈ సందర్భంగా కోవెలమూడి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడుకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్చుకోలేక వైసీపీ నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు అని, రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న జగన్ రెడ్డిని ప్రజలు ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారు అని, ఇలాంటి చర్యలకు రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కుంచకర్ల ధర్మ తేజ, వంశి, కనపర్తి శ్రీనివాసరావు, ముత్తినేని రాజేష్, ఈరంటి వరప్రసాద్, కసుకుర్తి హనుమంతరావు, సింగంశెట్టి వీరయ్య, పాకలపాటి శ్రీకాంత్, గుడిపాటి రమేష్, మన్నవ వంశి, అమృతరావు, ఈశ్వర్, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమిషనర్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ పురపాలక సంఘం కమిషనర్ తమ పందులను అమ్ముకున్నాడని పందుల పెంపకం దారుడు దార్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మరికొందరు బాధితులు రాష్ట్ర గవర్నర్కు ఫిర్యాదు చేశారు. గవర్నర్ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ విచారణ నిమిత్తం పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ సి శ్రీరాములను నియమించగా బుధవారం ఆయన వినకొండ తాసిల్దార్ కార్యాలయంలో బాధితులను, మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్‌లను పిలిపించి విచారణ చేపట్టారు. సాయంత్రం పందులు పెంపకం ప్రాంతమైన చెక్క వాగు వద్దకు వెళ్లి పరిశీలించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ తెలిపారు. విచారణలో వినుకొండ తాసిల్దార్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పందులు అమ్ముకున్నారు

వినుకొండ కమిషనర్ బి. శ్రీనివాసులు సుమారు రూ.20 లక్షలు విలువ చేసే పందులను దౌర్జన్యంగా పట్టుకొని అమ్ముకున్నట్లు ఫిర్యాదుదారుడు దార్ల కోటేశ్వరావుతో పాటు 70 మంది బాధితులు డిప్యూటీ కలెక్టర్ వద్ద వాపోయారు. నాలుగు నెలల క్రితం నాలుగు లారీల్లో 400 పందుల్ని విడతలవారీగా పట్టుకుని తీసుకువెళ్లారని వివరించారు. గొర్రెలు, మేకలు, బర్రెల పెంపకం లాగానే తాము పందుల పెంపకం పై ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. వినుకొండలో సుమారు 100 కుటుంబాలు మూడు తరాలుగా పందులు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. వినుకొండ ప్రాంతంలో పందులు ఉండడానికి వీల్లేదని కమీషనర్ హెచ్చరికలు జారీ చేయడంతో పట్టణానికి దూరంగా చెక్క వాగులో పందుల పెంపకం చేసుకుంటున్నట్లు తెలిపారు. నాలుగు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్ సుమారు 40 మంది వ్యక్తులను పిలిపించి పందులను పట్టించి లారీల్లో తరలించాడని తెలిపారు. అడ్డుకున్న తమను, మా కుటుంబ సభ్యులను పోలీసులతో బెదిరించి స్టేషన్లలో కూర్చోబెట్టి పందులు పట్టుకోవడం జరిగిందన్నారు. సుమారు 400 పందుల్ని పట్టుకుని బెంగళూరు మార్కెట్లో అమ్ముకున్నట్లు వివరించారు. ఒక్కొక్క పంది విలువ 7 నుంచి 12 వేల వరకు ఉంటుందని, పట్టుకు వెళ్ళిన పందులు విలువ సుమారు 20 లక్షలు ఉంటుందని తెలిపారు. పందుల పెంపకం తమ వృత్తి అని, పందులను కొనుగోలు చేసుకుని పెంచి అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటామని, 400 పందులను తీసుకువెళ్లడంతో తమ కుటుంబాలు అప్పుల పాలై తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. పందులను పట్టుకొని అమ్ముకున్న కమిషనర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు అధికారులను కోరారు.

అవన్నీ అవాస్తవాలు

పై ఫిర్యాదులపై మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాసులను వివరణ కోరగా. అవన్నీ అవాస్తవాలని మూడు మాసాల క్రితం పట్టణంలో సంచరిస్తున్న పందుల వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న నేపథ్యంలో పలు ఫిర్యాదుల మేరకు పందులను పట్టే వాళ్లను పిలిపించి పందులను ఇతర ప్రాంతాలకు తరలించామే కానీ మరొకటి కాదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న కుక్కలను పట్టించి అటవీ ప్రాంతాలకు తరలించే విధంగా పందులను కూడా తరలించామన్నారు. అలాగే ఈ సంఘటనపై విశాలాంధ్ర మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరిని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని ఆయన అన్నారు.

దేశ సంపదను దోచిపెడుతున్న మోదీ

విశాలాంధ్ర- కర్లపాలెం: మోదీ ఎన్నికల వాగ్దానాలు మరచి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచుపెడుతున్నారని సిపిఐ జిల్లా నాయకులు జే.బి శ్రీధర్ తెలిపారు. గోడపత్రులను ఆవిష్కరించి శ్రీధర్ మాట్లాడుతూ నల్లధనం వెలుగుతీత, రైతు ఆదాయం రెట్టింపు, పేదరిక నిర్మూలన, ఏడాదికి కోటి ఉద్యోగాల కల్పన, ధరల స్థిరీకరణ, దేశ సమైక్యత సమగ్రాభివృద్ధి సాధించడంలో బిజెపి ఘోరంగా విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, ఎల్బీసీ, బ్యాంకింగ్, పోస్టల్, టెలికాం, రక్షణ, ఏయిర్ లైన్స్, విద్యుత్తు, ఉక్కు ఫోర్ట్ లను అంబానీ, ఆదానీలకు తెగనమ్ముతున్నాడన్నారు. సంపద సృష్టిలో భాగస్వామ్యం అవుతున్న శ్రామిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి దోపిడీకి ద్వారాలు తెరిచారన్నారు. సాగు చట్టాల పేరుతో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. హిడెన్ బర్గ్ నివేదికలో ఆదాని మోసాలను బయటపెట్టిన మోడీ ప్రభుత్వం విచారణ చేయకపోగా వెనకేసుకొస్తుందన్నారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీధర్ పిలుపునిచ్చారు నాయకులు షేక్ కరిముల్లా తదితరులు ఉన్నారు.

వంద పడకల ఆస్పత్రి ఎందుకు పూర్తి చేయలేదు? ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మీ కమీషన్ల కక్కుర్తి కోసం సుమారు సంవత్సరం పాటు ఆసుప్రతి నిర్మాణ పనులను అడ్డుకున్నారని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినిపై మాజీ మంత్రి ప్రత్తిపాటి శుక్రవారం పలు విమర్శలను ఎక్కుపెట్టారు. నూతన ఆసుపత్రి వద్ద సెల్ఫీ తీసుకొని, విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తాను ఎంతో శ్రమించి నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రిని 2018వ సంవత్సరంలో సాధించడం జరిగిందని, 2019 ఫిబ్రవరి పదో తేదీ తాను శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించి, 2019 ఎన్నికల సమయానికి 30శాతం పనులను శరవేగంగా పూర్తి చేయించడం జరిగిందని వివరించారు. అనంతరం వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థానిక ఎమ్మెల్యే హెూదాలో 2019 లో ఆసుపత్రిని సందర్శించిన రజిని, నాడు జరుగుతున్న ఆసుపత్రి నిర్మాణ పనులను ఎందుకు నిలిపి వేయించారు? ప్రశ్నించారు. అధికారులు, ఇంజనీర్ల అభ్యర్థనతో మరలా పనులను ప్రారంభించడం జరిగింది. అసలు నిర్మాణ పనులను ఎందుకు ఆపారు? ఎందుకు ప్రారంభించారు? మీకైనా తెలుసా? అని ప్రశ్నించారు.

పరిపాలన క్షేత్రస్థాయికి తీసుకువెళ్లిన ఘనత జగన్‌దే

విశాలాంధ్ర-బల్లికురవ: రాష్ట్ర చరిత్రలో క్షేత్రస్థాయిలో పరిపాలనను తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని కొనిదెన గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న ఇప్పటికే 98 శాతం హామీలు అమలు చేశారన్నారు.విశ్వసనీయత అంటే ఇదేనని జగనన్నకు మించిన విశ్వసనీయత గల నాయకుడు రాష్ట్రంలో మరొక నాయకుడు లేరన్నారు. పార్టీలకతీతంగా అర్హత ఉంటే చాలు ఎలాంటి సంక్షేమ పథకమైన సరే నేరుగా వారికి అందించటమే ప్రభుత్వ నినాదమనరు.రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాల అమలు అవుతున్నాయి అని ప్రజలంతా మరొకసారి జగనన్నను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య,ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ తన్నీరు లేపాక్షి విష్ణు,కొణిదన మాజీ ఎంపీటీసీ కుంచపు రాఘవరావు,మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువలి,ప్రచార కమిటీ అధ్యక్షుడు టి నరేష్,ధూళిపాళ్ల బులిరామయ్య, జూపల్లి రాఘవరావు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు వివిధ గ్రామాల సర్పంచ్లు ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

30 నెలల్లో మచిలీపట్నం పోర్టు నిర్మాణం

విశాలాంధ్ర-మచిలీపట్నం: మేలో సీఎం మచిలీపట్నం పోర్టు పనులకు భూమి పూజ నిర్వహించిన అనంతరం 30 నెలల వ్యవధిలో పోర్ట్ నిర్మాణం పూర్తవుతుందని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ బందరు పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పోర్ట్ అభివృద్ధి పనులు పరిశీలించారు. మొత్తం 1922 ఎకరాల్లో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులు గురించి ఆరా తీశారు. ముడ మాస్టర్ ప్లాన్ పరిశీ లించి, చేపట్టవలసిన పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మిత ప్రాంతం పరిశీలించారు. బ్రేక్ వాటర్ ప్రాంతం, డ్రెడ్జింగ్ ప్రాంతం, అప్రోచ్ ఛానల్ ఏరియా వరకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ, బందరు పోర్టు నిర్మాణానికి అవసరమైన భారీ యంత్రాలు, మెటీరియల్ తరలించుటకు అనువుగా పోర్టు కనెక్టివిటీ రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, ఈ పనులు ఇంకా వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి పోర్టు పనులు ప్రారంభించేందుకు అంగీకరించారని, దీంతో పోర్టు సన్నద్ధత పనులు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పోర్టు పనులకు భూమి పూజ నిర్వహించిన అనంతరం పోర్టు నిర్మాణ పనులు సమీపంలో బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. పోర్టు నిర్మాణ పనులు మొదలు పెట్టుటకు అవసరమైన భారీ యంత్రాలను నిర్మాణ సంస్థ ఇప్పటికే తరలించిందని, ముఖ్యమంత్రి పోర్ట్ పనులు లాంఛనంగా ప్రారంభించగానే, నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు. అనంతరం తవిసిపూడిలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఏపీ మ్యారీటైం బోర్డు ఎండి విద్యా శంకర్, ముడ విసి రాజ్యలక్ష్మి, మేఘా ఇంజనీరింగ్ జనరల్ మేనేజర్ తులసీ దాస్, రైట్స్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ సూర్య, ఆర్డీవో ఐ కిషోర్, బందరు తాహిసిల్దార్ డి సునీల్ బాబు, రైట్స్ సంస్థ ప్రతినిధులు, వెంట ఉన్నారు.

ఇదేమి కర్మ మన రాష్ట్రానికి స్వల్ప మార్పు

విశాలాంధ్ర-పెదపారుపూడి: రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, నిత్యవసర ధరలు ఆయిలు తదితర వస్తువుల పెంపుపై ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో స్వల్ప మార్పు జరిగినట్లు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు శుక్రవారం తెలిపారు. మసిముక్కు మాట్లాడుతూ మండలంలోని భూషణగూళ్ళ గ్రామంలో శుక్రవారం జరగవలసిన కార్యక్రమం ఆదివారం జరుగుతు న్నందున మండలంలోని టిడిపి శ్రేణులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

మహారాజశ్రీ మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.ఎస్.నెంబర్:449/2022 మరియు
ఐ.ఎ.నెంబర్: 1567/2022

బిట్వీన్ :
బూసాని పేరమ్మ - పిటిషనర్/ప్లేంటిఫ్
మరియు
1. పిన్నెల్లి నాగరాజు మరియు ఇద్దరు ఇతరులు - రెస్పాండెంట్స్/డిఫెండెంట్స్

To:
R2/D2 : పిన్నెల్లి నరసింహారావు S/o. నాగరాజు
R3/D3 : పిన్నెల్లి గణేష్ S/o. నాగరాజు
ఇరువురి చిరునామాలు: పోలేపల్లి గ్రామం, దుర్గి మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబర్ దావాలో పిటిషనర్/ ప్లేంటిఫ్ తమరికి కోర్టు వారి ద్వారా ఎన్ని సార్లు సమన్లు/నోటీసులు పంపినను మీకు ముట్టీ యుండ నందున నోటీసు ప్రచురణ నిమిత్తం ది:15-05-2023వ తేదీన వాయిదా రోజు ఉదయం 10 గంటల 30 నిమిషములకు పైకోర్టు వారి ఎదుట హాజరై ఆరోపణలు ఉన్న యెడల తెలియపరచుకొనగలరు.
వాయిదా తేదీ: 15-05-2023.

కామిశెట్టి నాగలక్ష్మి, అడ్వకేట్ గురజాల, పిటిషనర్/ప్లేంటిఫ్ తరపు న్యాయవాది.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

విశాలాంధ్ర-చీరాల: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంచి నీటి చలివేంద్రం ఏర్పాటు చేశామని డాక్టర్ ఇస్తర్ల బాబురావు అన్నారు.శుక్రవారం చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీరాల రైల్వే స్టేషన్ లో ప్రజల దాహార్తి తీర్చేందుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వేసవి మంచినీటి చలివేంద్రంను మునిసిపల్ చైర్మెన్ జంజనం శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. బాల వెంకటేశ్వరరావు,బి హేమంత్ కుమార్, స్టేషన్ మాస్టర్ ప్రసాద్,వంగర పూర్ణ చంద్రరావు, ఎస్వీ స్వామి, సుభాషిణి, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, కె శ్రీనివాస బాబు, వలివేటి మురళీకృష్ణ, ఏకాంబరేశ్వరబాబు, రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కాపురం వెళ్లిన రైతు నేతలు

విశాలాంధ్ర-యద్దనపూడి: ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో జరుగుతున్న రైతన్నలతో మన చంద్రన్న కార్యక్రమంలో పాల్గొనేందుకు యద్దనపూడి మండలంలో పలు గ్రామాల నుండి రైతులు తరలి వెళ్లారు. రంగయ్య చౌదరి, కే నాగేశ్వరరావు జీ తారక రామారావు, కే వంశీ కృష్ణ, వాసు, బి.సాంబశివరావు, పత్తిపాటి వేణుబాబు, నిమ్మల సాంబశివరావు, పెరవల్లి వెంకటరావు, సోమేపల్లి బాబు తదితరులు వెళ్లారు.

రంజాన్‌కు పటిష్ట భద్రత

విశాలాంధ్ర-బాపట్ల: ప్రశాంతమైన వాతావరణంలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ జరుపుకోవడానికి పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శనివారం రంజాన్ ఉపవాసాలు ముగించుకుని ఈద్ ఉల్ ఫితర్ జరుపుకునేందుకు సిద్ధమవుతున్న ముస్లిం సోదరులకు ఎస్పీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియాపై నిఘా ఉంచాలని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ జరుపుకొనేవిధంగా తగిన ముందస్తు భద్రతాచర్యలు తీసుకున్నామన్నారు.

మంత్రి, అధికారుల రంజాన్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-బాపట్ల: రంజాన్ పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం సంయుక్త ప్రకటనలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మాజీ ఉపసభాపతి, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి కూడా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ముస్లిం సోదరులంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో మెలగాలని వారు కోరారు.

ఐకమత్యంతోనే ఏదైనా సాధించగలం

విశాలాంధ్ర-చీరాల: ఐకమత్యంతోనే ఏదైనా సాధించగలమని, ఐకమత్యంగా ఉంటూ తమ హక్కులు సాధించాలని వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. రామకృష్ణాపురంలో డాక్టర్ హైమా సుబ్బారావు అధ్యక్షతన చీరాల నియోజకవర్గ నాయి బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చీరాల వైసీపీ ఇన్చార్జ్ కరణం వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 25న మంగళవారం తాడేపల్లిలో జరుగు థాంక్యు సీఎం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని కరణం వెంకటేష్ ఆవిష్కరించారు. డాక్టర్ తాడివలస దేవరాజు,మచవరపు వెంకటేశ్వర్లు, ఆతిన బోసు బాబు, వల్లూరి వెంకటస్వామి,వల్లూరి శ్రీనివాస్‌రావు, మెడిసెట్టి సత్యనారాయణ, కొరవడ సత్యనారాయణ, కశింకోట శివ, వల్లూరి వెంకట సుబ్బారావు, పెద్దపల్లి నూకరాజు,యమర్తి బాల పున్నయ్య, మల్లవరపు కన్నయ్య, భట్టిప్రోలు శ్రీనివాస్, సతీశ్, కొమ్మూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్,గుంటూరువారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునదిఏమనగా,నాక్లయింటు వద్దకు బాపట్లజిల్లా, బల్లికురవ (మం)&గ్రామం కాపురస్తులు పావులూరి వీరాంజనేయులు తండ్రి. లేటు వెంకటేశ్వర్లు గారు ది.28-03-2023న డిటో గ్రామ కాపురస్తులు పావులూరి పద్మావతి గారి వద్ద నుండి సెటిల్‌మెంట్ దస్తావేజు నెం.1498/2023 యస్.ఆర్.ఓ. మార్టూరు ద్వారా సెటిల్‌మెంట్ దస్తావేజు పొంది సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించుచున్న ఆస్తికిచెందిన లింకు విక్రయ దస్తావేజు నెంబరు 372/1960 మరియు దఖలు దస్తావేజు నెం.1547/2009 యస్.ఆర్.ఓ. మార్టూరు గల దస్తావేజులు పోయినవని, దొరకలేదని దొరికినవారి తెచ్చి ఇవ్వగలరని చెప్పి నాక్లయింటును ఋణముకొరకు సంప్రదించి యున్నందున సదరు షెడ్యూలు ఆస్తిపైగానీ, పోయిన దస్తావేజులపై గానీ, మంజూరుచేయు ఋణముపైగానీ ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయవలెనని గడువులోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్తిగా భావించి లోను మంజూరు చేయబడును మరియు గడువు అనంతరమువచ్చు ఆక్షేపణలు, వగైరాలు నాక్లయింటు హక్కులను బైండుచేయబడవు.

షెడ్యూలు:బాపట్ల డి॥& రి.డి॥, మార్టూరు సబ్.డి॥, బల్లికురవ (మం), బల్లికురవ గ్రామ సర్వే నెం.31/2బి య.0-23సెంట్లు డోర్.నెం.1-83/1 (అసెస్‌మెంట్ నెం.861) (అసెస్‌మెంట్ నెం.862) చ.గ.484లు స్థలము అందలి ఆర్.సి.సి. డాబా ఇంటికి హద్దులు. **తూర్పు:** బజారు హద్దు, అ.43.56లు, **దక్షిణం:** పావులూరి హనుమంతరావు వగైరాల స్థలముహద్దు, అ.100లు, **పడమర:** పావులూరి పిచ్చయ్య వగైరాల స్థలం హద్దు, అ.43.56లు, **ఉత్తరం:**ధూళిపాళ్ళ ఆదినారాయణ గారి స్థలం హద్దు, అ.100లు.

కోటంరాజు హరి శంకరప్రసాదు, అడ్వకేట్
D.No.87-142/1, Sambasiva Nagar, Lalpuram Road, Chuttugunta, Guntur. Cell :9490343123

జగన్ తీరు కోర్టు ధిక్కారానికి నిదర్శనం

సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు పీ నాగాంజనేయులు

విశాలాంధ్ర-భట్టిప్రోలు: సెప్టెంబర్ నుండి విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన కొనసాగిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం కోర్టు ధిక్కారానికి నిదర్శనమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు విమర్శించారు.శుక్రవారం భట్టిప్రోలు సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా సొంతబొమ్మళి మండలంలో మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు భూమి పూజ చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ నుండి విశాఖ నుంచి పరిపాలన జరుగుతుందని చెప్పటాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా గుర్తించి అభివృద్ధి పరచాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును ఇవ్వడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకొన్న విషయాన్ని నాగాంజనేయులు గుర్తు చేశారు ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయం సుప్రీంకోర్టులో ఉండగా విశాఖ నుండి పాలన సాగిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేర్కొనటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాను అధికారంలోకి వస్తే అమరావతిని అందంగా తీర్చిదిద్దుతానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన అమరావతిని నిర్వీర్యం చేస్తున్నారని అమరావతిని కాపాడుకునేందుకు ఏలాంటి త్యాగాలకైన సిపిఐ సిద్ధంగా ఉందని నాగాంజనేయులు అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ బాపట్ల జిల్లా కమిటి సభ్యులు గొట్టుముక్కల బాలాజీ, వేమూరు నియోజకవర్గం కార్యదర్శి బందారు శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలకు ప్రభుత్వం చర్యలు

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్.టి. కృష్ణబాబు చెప్పారు. జిల్లాలో శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చేరుకొని ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించి వైద్యసేవలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాపట్లలో చేపట్టిన వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి బాపట్లలోని ఏరియా వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ.పి. విభాగం, ప్రసూతి కాన్పుల విభాగం, లేబరేటరి విభాగం, బ్లడ్ బ్యాంకు పనితీరు, ఔషధాల విభాగం, నిల్వ కేంద్రాలను తనిఖీ చేశారు. వైద్యశాలలోని వైద్య పరికరాలు, యంత్ర పరికరాలను ఆయన పరిశీలించారు. కాన్పుల విభాగంలో బాలింతలకు అందుతున్న వైద్య సేవలను అడిగి బాలింతలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ వార్డులో వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలపై ఆయన ఆరాతీశారు. వైద్యశాల పరిసరాలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.టి. కృష్ణబాబు తెలిపారు. జిల్లా కేంద్రంలో మంజూరైన వైద్య కళాశాలకు స్థలం సమస్య రావడంతో నిర్మాణ పనులలో ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం శరవేగంగా కళాశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో అన్ని జిల్లాలలో ఆకస్మిక పరిశీలన, తనిఖీలు చేపడుతున్నామన్నారు. గ్రామాలలో పరిస్థితులు, వైద్యులు, సిబ్బంది పనితీరు, ప్రజలలో ఏ మేరకు అవగాహన ఉందో తెలుసుకోవడానికి పరిశీలన చేస్తున్నామని ఆయన వివరించారు. ముఖ్యంగా గర్భిణులు ప్రసూతి సమయంలో ఇబ్బందులు పడకుండా మెరుగైన వైద్యం పొందేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వైద్యరంగంలో సమస్యలన్నీ త్వరలో పరిష్కారం కానున్నాయని ఆయన తెలిపారు.ఆయన వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్. విజయమ్మ, వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ సిద్ధార్థ తదితరులు ఉన్నారు.

గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్ట్

విశాలాంధ్ర-మార్టూరు: కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద మార్టూరు సిఐ షేక్ ధెరిసా ఫిరోజ్, ఎస్సై కోడూరి కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు వెంటాడి కారులోని రూ.4.50 లక్షల విలువ గల 140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లాకు చెందిన మొయిద్దీన్ కుట్టి,సుధీష్ కోరనాథ్ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. బాపట్ల డీఎస్పీ ఏ.శ్రీనివాస్ గురువారం మార్టూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో జిల్లా పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిపై పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. చిలకలూరిపేట నుండి ఒంగోలు వైపు అతివేగంగా వెళ్తున్న కారు పోలీసులను గమనించి వెంటనే ఒక్కసారిగా వెనక్కి తిప్పుకొని తిరిగి దేగరమూడి వైపు పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. సిఐ ఆదేశాలతో ఎస్సై కమలాకర్ తమ సిబ్బందితో కార్‌ని తమ వాహనంలో వెంబడించగా కొద్దిసేపటికి మరొక కారుని పోలీసులు ఆపడానికి ప్రయత్నించగా ఆవాహన డ్రైవర్ పోలీసులను చూసి అక్కడ నుంచి ఉడాయించారు. అప్రమత్తమైన సీఐ ఫిరోజ్ ఆ కారును వెంబడించి అందులోని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముందు పోలీసులను చూసి పరారయిన కారు కోసం గాలించగా దేగరముడి సమీపంలో ఆ కారుని అక్కడ వదిలేసి నిందితులు పారిపోయినట్లు గుర్తించారు.ఆగి ఉన్న కారులో 100 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేరళ రాష్ట్రంలో డ్రైవర్లుగా పనిచేస్తున్న ఇద్దరు నిందితులు గంజాయి వ్యాపారం చేసి డబ్బులు సంపాదించాలనే ఆశతో కేరళ రాష్ట్రంలో రెండు కారులు బాడుగకు తీసుకొని రాజమండ్రి నుండి కేరళకు గంజాయి తరలిస్తుండగా పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయితరలిస్తున్న ముఠాను ప్రతిభ కనబరిచి పట్టుకున్నందుకు సిఐ ఫిరోజ్ ఎస్సై కమలాకర్, ఏఎస్ఐ సైదా, పివి సుబ్బారావు, కోటేశ్వరరావు, ప్రసాద్, నరేంద్ర, రాజేష్‌లకు డీఎస్పీ శ్రీనివాసరావు ,ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య తీరు ఆక్షేపణీయం

విశాలాంధ్ర-బాపట్ల: బాపట్లలో అల్లర్లకు దారితీసేలా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య వివాదస్పద తీరును ప్రదర్శిస్తున్నారని అంటరానితన నిర్మూలనపోరాట సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ జి.చార్వాక, మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద కొండయ్యపై పిర్యాదు చేసి మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలనులను మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ కొండయ్య వారి సిబ్బందితో ఎటువంటి సమాచారం లేకుండా తొలగించారన్నారు. తొలగించిన అంబేద్కర్ ఫ్లెక్సీలను మున్సిపల్ కార్యాలయం పక్కన చెత్త కుప్పలో పడవేయడం దారుణమన్నారు. బాపట్ల ఆవిర్భావ సభకు సంబంధించిన ఫ్లెక్సీ తొలగించకుండా అంబేద్కర్ ఫ్లెక్సీలను మాత్రమే తొలగిస్తున్నారని కొండయ్యను ప్రశ్నించగా ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రతిరోజు ఈ ఫ్లెక్సీలలో అంబేద్కర్ ముఖాన్ని చూడలేకపోతున్నామని అంటున్నారని అందుకే తొలగించామని కొండయ్య సమాధానం చెప్పారన్నారు. అన్నీ ఫ్లెక్సీలు తీయకుండా ఈ ఫ్లెక్సీ మాత్రమే ఎందుకు తీశామని దళజత నేతలు ప్రశ్నించగా ఎమ్మెల్యే తీసేయమన్నాడు మేము తీసేశాము మీ ఇష్టం మీకు దిక్కున చోట చెప్పుకోండి అని కరాకండిగా మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ కొండయ్య చెప్పారన్నారు. కొండయ్య తక్షణమే దళితులకు క్షమాపణ చెప్పాలని లేకుండా బాపట్ల బంద్‌కు పిలుపునిస్తామని తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కోన రఘుపతిని వివరణ కోరగా బాపట్ల పట్టణంలో రోడ్ల విస్తరణ జరుగుతుంది ఏదైన కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీలను వేసినప్పుడు వాటిని మూడు నాలుగు రోజులు ఉంచి తొలగించమని మాత్రమే చెప్పానన్నారు. అంబేద్కర్‌ను అవమానించటం తక్కువగా చేసి మాట్లాడటం ఎప్పటికి జరగదని మహోన్నత వ్యక్తి అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని ఎమ్మెల్యే కోన కోరారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల పాత్ర కీలకం

విశాలాంధ్ర-పర్చూరు: నేరాల నియంత్రణకు, నేరాల పరిశోధనకు సీసీ కెమెరాల పాత్ర కీలకమైనదని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నేరాలు జరుగుతున్న తీరు, నేరం చేసే విధానం అనేక విధాలుగా ఉంటాయని, వాటిని చేదించటం పోలీసు శాఖకు సవాలుగా మారిందని అన్నారు. నేరం జరగకుండ ముందుగా నియంత్రించాలన్న లేదా నేరం జరిగిన తర్వాత నిందితులను గుర్తించుటకు సీసీ కెమెరాలు దోహదపడుతునాన్నయని ఎస్పీ తెలిపారు. పర్చూరు మండలంలో 32 కెమెరాలు ఏర్పాటు చేయటంలో దాతల సహకారం అభినందనీయమని, ఒక్కొక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, ప్రజలకు, మహిళలకు, వ్యాపారస్తులకు పటిష్టమైన భద్రత లభిస్తుందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. దాతలను ఎస్పీ దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ ఏ.శ్రీనివాసరావు, సిఐ ఫిరోజ్, ఎస్బీ సిఐ శ్రీనివాస్, పర్చూరు, మార్టూరు ఎస్సైలు ఎన్‌సీ ప్రసాద్, కమలాకర్, మహిళా పోలీసులు, ప్రజాప్రతినిధులు, దాతలు పాల్గొన్నారు.

డీపీవో పీఠం కోసం అవినీతి అధికారి కుస్తీ

విశాలాంధ్ర-బాపట్ల: జిల్లా పంచాయితీ అధికారి (డీపీవో) పీఠం కోసం అవినీతి అధికారి కుస్తీ పడుతున్నాడని జిల్లాలో జోరుగా చర్చ జరుగుతుంది. జిల్లా కేంద్రానికి దగ్గర్లో ఉన్న మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన అధికారి డీపీవోగా రావాలని ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే అధికారి ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండేళ్ల క్రితం కరోనా సమయంలో భారీస్థాయిలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి నకిలీ బిల్లులతో కోట్లు దోచుకున్నాడని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయినా రాజకీయ పలుకుడి రంగరించి కొత్తగా ఏర్పడిన జిల్లాలో పీఠంపై ఎక్కాలని ఉవ్విళ్లురుతున్నాడని వార్త చక్కర్లు కొడుతుంది.ఇదే అధికారి డీపీవో పీఠంపై ఎక్కితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాను చేసిన కుంభకోణం పునరావృత్తం అవుతుందనటంలో ఎటువంటి సందేహంలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. జిల్లా పంచాయితీ అధికారిగా సమర్థమైన అవనీతి ఆరోపణలు లేని వ్యక్తిని కేటాయించి జిల్లాలో పంచాయితీల అభివృద్ధికి పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు.

మీ కుటుంబ సభ్యుడిలా ఆదరించండి - వేగేశన

విశాలాంధ్ర-పిట్టలవానిపాలెం : రాబోయే ఎన్నికల్లో బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, నన్ను మీ కుటుంబ సభ్యుడిలా భావించి ఆదరించాలని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు.ఇంటింటికీ తెలుగుదేశం, మీ మాట - నా బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ విధానాలను ప్రజలకు వివరించారు.మహిళలకు చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి, తన గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేసి ఆశీర్వదించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ ప్రజలకు అండగా మా వేగేశన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ చేరువయిన విషయం అందరికీ తెలుసని అన్నారు.అవినీతి, లంచాలకు తావులేని వ్యవస్థలను నిర్మించి కలిసికట్టుగా మన బాపట్లను అభివృద్ధి చేస్తానని చెప్పారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బాపట్ల నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి అండగా నిలుస్తానని తెలియజేశారు.అనంతరం చందోలులో నిజాం బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ తోఫాను నిరుపేదలకు వేగేశన నరేంద్ర వర్మ అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అఫ్జల్, బాపట్ల పార్లమెంటరీ మైనార్టీ అధ్యక్షుడు ఖాసిం, గ్రామ పార్టీ అధ్యక్షుడు రజాక్, గ్రామ పార్టీ సీనియర్ నాయకులు మీరా, సైదా, అన్వర్ మరియు కార్యకర్తలు నిజాం,మజార భాష, మజారుల బేగ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

విశాలాంధ్ర-నిజాంపట్నం: నిజాంపట్నం మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ గురుకుల కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్ ఎంపీసీలో 60 సీట్లు, బైపీసీలో 40సీట్లు, సీఈసీలో 40సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 19 నుంచి మే 18 వరకు https://mjpapbcwreis.apcfss.in లో రూ.250 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 28న పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసే విద్యార్థి వయసు 17 సంవత్సరాలకు మించరాదని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.1 లక్ష రూపాయలకు మించరాదని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ : 9866559636, 08648-257972లో సంప్రదించాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర-పర్చూరు: విద్యార్థుల పౌష్టికాహారంపై దృష్టి సారించాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఎంటీ కృష్ణబాబు తెలిపారు. పాఠశాల ఆరోగ్య పథకంలో భాగంగా శుక్రవారం మండలంలోని చెరుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. వారి సమాధానాలతో సంతృప్తి చెందారు. రక్తహీనతకల పిల్లల ఆరోగ్యం మెరుగుపడటానికి తీసుకోవాల్సిన చర్యలును అధికారులతో కలిసి చర్చించారు. విద్యార్థులు ఆకుకూరలుతో పాటు చిక్కిలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్యంపై తనిఖీలు చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. రక్త పరీక్షలు నిర్వహించారు. వీరివెంట వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి విజయమ్మ, ఆర్డీఓ రవీందర్, ఉపవిద్యాధికారి వెంకటేశ్వర్లు, వైద్యాధికారి మైత్రేయి, తహశీల్దార్ నెహ్రూబాబు, మండల విద్యాధికారి నాగేశ్వరరావు ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన ఎస్పీ

విశాలాంధ్ర-పర్చూరు: స్థానిక బొమ్మల సెంటర్‌లో రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంను శుక్రవారం ఎస్పీ వకుల్ జిందాల్ ప్రారంభించారు. రోటరీ సేవలను అభినందించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐ ఫిరోజ్, ఎస్సై ఎన్‌సీ ప్రసాద్, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు నాగభైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, ట్రస్ట్ అధ్యక్షులు గడ్డిపాటి శ్రీనివాసరావు, సపోర్టు అధ్యక్షులు పోలిశెట్టి చంద్రం, ప్రతినిధులు కోటా శ్రీనివాసరావు, కాసా అశోక్, ఏవీ కృష్ణ, పాబోలు వెంకన్న ఉన్నారు.

స్ఫూర్తిగా నిలిచేందుకు సివిల్ సర్వీసెస్ డే

విశాలాంధ్ర-బాపట్ల: ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి వారికి స్ఫూర్తిగా నిలిచేందుకు నేషనల్ సివిల్ సర్వీసెస్ డేను జరుపుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాల్‌లో జాతీయ పౌర సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ పబ్లిక్ సర్వీస్ విభాగాలలో నిమగ్నమై ఉన్న అధికారుల పనిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న నిర్వహిస్తామన్నారు. పౌర సేవకులు దేశం యొక్క పరిపాలనా యంత్రాంగాన్ని సమిష్టిగా పౌరులకు సేవ చేయాలనే అంకితభావంతో నడపాలన్నదే ప్రధాన అంశమన్నారు. సివిల్ సర్వీస్ అనేది దేశ ప్రభుత్వం యొక్క ప్రజా పరిపాలనకు బాధ్యత వహించే సేవ అన్నారు. 16వ నేషనల్ సివిల్ సర్వీసెస్ డేను సందర్భంగా సభ్యులచే జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, డి.ఆర్. డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్,వ్యవసాయ శాఖ జె.డి.అబ్దుల్ సత్తార్,పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, మత్స్య శాఖ జె.డి సురేష్,పౌర సరఫరాల శాఖ అధికారులు విలీమ్స్, శ్రీలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాలువల పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-బాపట్ల: జిల్లాలో వ్యవసాయ సీజన్‌కు ముందుగా సాగునీటి కాలువల పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంట కాలువలను అభివృద్ధి పనులు చేయడానికి రూ.23 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. త్వరలో కాలువల అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇన్‌ఫుట్ సబ్సీడీ ఇవ్వాలని ఆయన చెప్పారు. రైతులు పండించిన శనగలు,కందులు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో రైతులు పండించిన పంటలకు ఆర్.బి.కె ల ద్వారా మద్దతు ధర కల్పిస్తామని ఆయన చెప్పారు. జిల్లాలో రైతులు వేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన ఈ-క్రాప్ నమోదును వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, మత్స్య శాఖ జె.డి సురేష్, ఉద్యాన వన శాఖ ఎ. డి జెనెమ్మ,వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ధరణీ కుమార్‌పై సస్పెన్షన్ వేటు

విశాలాంధ్ర-రేపల్లె: టీడీపీ దండమూడి ధరణీ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు టీడీపీ పర్చూరు ఎమ్మెల్యే, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. రేపల్లె పట్టణ 14వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అన్నే రామకృష్ణ హత్య కేసులో దండమూడి ధరణీ కుమార్ పాత్ర ఉన్నట్లు పోలీసులు ధృవీకరించిన నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

కరణం వెంకటేష్‌కు సన్మానం



విశాలాంధ్ర-చీరాల: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చీరాల మండల పరిధిలోని రామకృష్ణపురం సచివాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ బాబును రామకృష్ణ పురం నివాసి జంగం రాకేష్ కుటుంబ సభ్యులు వారి గృహంలో ఘనంగా సన్మానించారు. వెంకటేష్ బాబు కుటుంబ సభ్యులతో కలిసి కొంతసేపు ముచ్చటించి చిన్నారులతో ఆప్యాయంగా పలకరిస్తూ కష్టపడి చదవాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసికొని రావాలని కోరారు. జంగం రాకేష్‌ను ఉద్దేశించి పార్టీకి పూర్తి సహాయ సహకారాలు అందించి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

పేదలకు అండగా పద్మ భాస్కర ఫౌండేషన్

విశాలాంధ్ర-చీరాల: రంజాన్ పండుగను పురస్కరించుకుని పేదలైన ముస్లిం మహిళలకు మా వంతు సహకరంగా చిరు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని పద్మ భాస్కర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఘంటా అనిల్ కుమార్ అన్నారు.శుక్రవారం చీరాల ఎల్ బిఎస్‌నగర్‌లోని 25 మంది పేద ముస్లిం మహిళలకు పద్మ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరు సహాయం అందించారు. ఘంటా అనిల్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా కుల మతాలకు అతీతంగా సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. రంజాన్, మొహరం పండుగ సమయాలలో పేద ముస్లిం మహిళలకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు.రాబోయే రోజుల్లో ఫౌండేషన్ ద్వారా పేదలకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పేద ముస్లిం మహిళలు పాల్గొన్నారు.